

దసరా వచ్చిందయా..

- నేడు విజయదశమి పర్వదినం
- ఆయుధ, శమీ పూజలు, పాలపిట్ట దర్శనాలకు సర్వం సిద్ధం
- ఖమ్మం జమ్మిబండ వద్ద పారువేటకు విస్తృత ఏర్పాట్లు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : శక్తి ఆరాధనకు ప్రాధాన్యమిచ్చే, చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే పండుగ దసరా. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు దసరా పండుగను మహాసంబురంగా జరుపుకొంటారు. మహాలయ అమావాస్యతో మొదలయ్యే ఈ విజయదశమి పండుగ సందడి నవరాత్రుల్లో దేవీ పూజలతో పాటు తర్వాతి రోజు దసరా వరకు వేడుకలు జరుపుకుంటారు. దసరా రోజు ఆయుధ పూజ, పొలిమేర దాటడం, జమ్మిచెట్టుపూజ, పాలపిట్ట దర్శనం చేసుకునే అనవాయితీ అనాదిగా వస్తున్న ఆచారం. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దసరా వేడుకలు జరగనున్నాయి. ఖమ్మం నగరంలోని జమ్మిబండ వద్ద దసరా వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా పండుగ నాడు జమ్మిబండపై ప్రత్యక్షమయ్యే (మిగతా 2వ పేజీలో)

రామక్షేత్రంలో వేడుకలకు ఏర్పాట్లు

- నేడు దసరా మండపంలో మహా పట్టాభిషేకం, శ్రీరామ లీలా మహోత్సవం
- మహాలక్ష్మిగా దర్శన మిచ్చిన అమ్మవారు 2

ఈ దసరా.. రైతులకు విజయం చేకూర్చాలి 2

పండుగ శుభాకాంక్షలు తెలిపిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి

'పల్లెపోరు'పై గురి..



- స్థానిక సమరానికి సై అంటున్న పార్టీలు
- కార్యాచరణలో నేతలు
- గ్రామ, మండల స్థాయిలోనే అభ్యర్థుల ఎంపిక
- ఆశావహులను జల్లెడ పట్టే పనిలో అధికార పార్టీ
- సత్తా చాటేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్న విపక్షాలు

ఖమ్మం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఓ వైపు హైకోర్టు తీర్పుపై టెన్షన్.. మరోవైపు పార్టీల అటెన్షన్.. మధ్య 'స్థానిక' సందడి మొదలైంది. జిల్లాలో ఎన్నికల పల్లె పోరుకు పార్టీలు సై అని కాలు దువ్వుతున్నాయి. గ్రామ, మండల కమిటీలకే అభ్యర్థుల ఎంపిక బాధ్యతలు అప్పగిస్తున్నాయి. అధికారపార్టీలో మంత్రులు, ఎమ్మెల్యేల పర్యవేక్షణలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరగబోతోంది. ఉమ్మడిజిల్లాలో ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతున్న నేపథ్యంలో మొదటి ప్రాధాన్యం వీటికే చూపిస్తున్నారు. రిజర్వేషన్ల ప్రక్రియ ఖరారవడంతో అందుకు అర్హులైన, గెలుపు అవకాశాలున్న జడ్పీటీసీ అభ్యర్థుల కోసం అధికార కాంగ్రెస్ జల్లెడ పడుతోంది. ప్రాదేశిక నియోజకవర్గం నుంచి ముగ్గురు ఆశావహుల పేర్లను 5వతేదీలోపు పంపాలని కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించింది. దీంతో దసరా తర్వాత కాంగ్రెస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జడ్పీటీసీల ఆశావహుల జాబితాను పంపించబోతున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు వారి పేర్లను సిద్ధం చేసినట్టు సమాచారం. ఎక్కువశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వుడు నియోజకవర్గాల జడ్పీటీసీ అభ్యర్థులున్నందున జనరల్ సీట్లు తక్కువగా ఉండడంతో కొంత ఉత్కంఠ తగ్గింది. అధికార కాంగ్రెస్‌లో జడ్పీ చైర్మన్ల ప్రకటన కూడా పార్టీ అధిష్ఠానం నుంచే ఉంటుందని సమాచారం. గ్రామాల్లో మరోవైపు సర్పంచ్, ఎంపీటీసీ జాబితాలను కూడా సిద్ధం చేస్తున్నారు. మండల, గ్రామస్థాయి కమిటీలే స్థానిక అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తుండగా, జడ్పీటీసీల ఎంపికలో ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గాల్లో అభ్యర్థుల జాబితాకు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల తర్వాత ఎంపీపీ అభ్యర్థుల విషయంలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సు మేరకే బలం ఉన్నచోట ఎంపిక ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి (మిగతా 2వ పేజీలో)

'దామన్న' ఇకలేరు..



- మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కన్నుమూత
- 4న తుంగతుర్తిలో అంత్యక్రియలు
- స్వగ్రామం కామేపల్లి మండలం పాతలింగాలలో విషాదం

కామేపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి (73) బుధవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో 1952 సెప్టెంబరు 14న నారాయణరెడ్డి, కమలమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించిన ఆయన తుంగతుర్తిలో స్థిరపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ నేత, మాజీ మంత్రి, స్వర్గీయ రాంరెడ్డి వెంకటరెడ్డికి సోదరుడైన దామోదర్‌రెడ్డి అంచెలంచెలుగా ఎదిగారు. అందరూ దామన్నగా పిలుచుకునే దామోదర్‌రెడ్డి 1985లో కాంగ్రెస్ అభ్యర్థిగా తుంగతుర్తి నుంచి పోటీ చేసి విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత 1989లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయనకు ఆ తర్వాత 1994 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిత్వం ఇవ్వకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. 1999లో ఓటమి పాలైన ఆయన మళ్లీ 2004లో తుంగతుర్తి నుంచే కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 2009ఎన్నికల్లో సూర్యాపేట నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఇక 2014, 2018, 2023లో కాంగ్రెస్ తరఫున బరిలో దిగిన ఆయన ఓటమిపాలయ్యారు. మొత్తంగా నాలుగు సార్లు తుంగతుర్తి, ఒక సారి సూర్యాపేట నుంచి గెలిచిన ఆయన ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దామోదర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కన్నుమూశారు. ఆయన అంత్యక్రియలు 4వతేదీన తుంగతుర్తిలో జరగనుండగా.. ఆయన పుట్టిన ఊరైన కామేపల్లి మండలం పాతలింగాలలో విషాద ఛాయలు అలముకున్నాయి. వ్యవసాయం, పశు పోషణలో ముఖ్యంగా మేలు జాతి గిత్తలను పోషించడంలో తన అన్న వెంకటరెడ్డితో పాటు దామోదర్‌రెడ్డి మంచి పేరుంది. రాంరెడ్డి సోదరుల ఎద్దుల జతలు ఉమ్మడి రాష్ట్రంలో పలు పోటీల్లో సత్తా చాటేవి. 2004 ఎన్నికల్లో పక్కపక్క నియోజకవర్గాలైన పాలేరు నుంచి రాంరెడ్డి వెంకటరెడ్డి, సూర్యాపేట నుంచి దామోదర్‌రెడ్డి ఇద్దరూ గెలుపొందారు. ఆ సమయంలో దామోదర్‌రెడ్డి మంత్రి అయ్యారు. దామోదర్‌రెడ్డికి సర్వోత్తమరెడ్డి ఒక్కడే కుమారుడు.

రామక్షేత్రంలో విజయదశమి వేడుకలు

- నేడు దసరా మండపంలో మహా పట్టాభిషేకం, శ్రీరామలీలా మహోత్సవం
- మహాలక్ష్మీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



భద్రాచలం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : రామక్షేత్రం భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో బుధవారం విజయ దశమి వేడుకలు నిర్వహించనున్నారు. స్థానిక దసరా మండపంలో శ్రీరామలీలా మహోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గత నెల 23నుంచి గురువారం వరకు శ్రీరామాయణ మహాపారా యణ మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో స్వామి వారికి ఉదయం ఆలయంలో శ్రీరామ మహాపట్టాభిషేకం, చిత్రకూట మండపంలో సంక్షేప రామాయణ హోమం, సాయంత్రం కూనవరం రోడ్డులోని దసరా మండపంలో విజయోత్సవం (శమీ పూజ) శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించ నున్నారు. శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించే దసరా మండపం వద్ద ఏర్పాట్లను దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఇంజనీరింగ్ విభాగం ఈఈ వి.రవీంద్రనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాసరెడ్డి పర్య వేక్షించారు. దసరా మండప ప్రాంగణాన్ని సిద్ధం చేయడంతో పాటు శ్రీరామలీలా మహోత్సవంలో భాగంగా రావణాసురుడి ప్రతిమను దహనం చేసేందుకు సిద్ధం చేస్తున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో వేంచేసి ఉన్న లక్ష్మీతాయారు అమ్మవారు బుధవారం మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి మహాలక్ష్మి అలంకారం ధరింపజేసి ప్రత్యేక పూజా కార్యక్ర మాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నిర్ణీత లక్ష్యం మేరకు బియ్యం పంపిణీ చేయాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): నిర్ణీత లక్ష్యం మేరకు సీఎంఆర్ బియ్యా న్ని అందించాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివా సరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మంది రంలో బుధవారం పెండింగ్ రా రైస్ డెలివరీ పై రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి గత ఖరీఫ్ సీజన్ పెండింగ్ ఉన్న 11 వేల 500 మెట్రిక్ టన్నులు రా రైస్, బాయిల్డ్ రైస్ 3500 మెట్రిక్ టన్నులు రాబోయే 20 రోజులో ఎఫ్‌సీకు మిల్లర్లు సరఫరా చేయాల న్నారు. ఖమ్మం జిల్లా నుంచి గత రబీ సీజన్ కు సంబంధించి పెండింగ్ ఉన్న 42 వేల మెట్రిక్ టన్నుల రైస్ డెలివరీకు రోజుకు 600 మెట్రిక్ టన్నుల సరఫరా దాటడం లేదని, దీనికి కారణాలను అదనపు కలెక్టర్ ఆరా తీశారు. రవాణా చార్జీలకు సంబంధించిన బిల్లులు రైస్ మిల్లర్లు శనివారం నాటికి అందిస్తే ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కేటాయింపుల కోసం రైస్ మిల్లర్లు తప్పనిసరిగా 10 శాతం బ్యాంకు గ్యారెంటీ సమర్పించాలని అన్నారు. ఈసమావేశంలో జిల్లా పౌర సరఫ రాల సంస్థ మేనేజర్ శ్రీలత, ఎఫ్‌సీఐ అధికా రులు, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు బొమ్మ రాజేశ్వర్‌రావు, మిల్లర్లు, పాల్గొన్నారు.

మున్నూరు కాపులు ఐక్యంగా ముందుకు సాగాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు1(ఆంధ్ర జ్యోతి): మున్నూరుకాపు కులస్థులు మిగతా బీసీ కులస్తులను కలుపుకొని ముందుకు సాగా లని మున్నూరుకాపు సంక్షేమసంఘం సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ అన్నారు. బుధవా రం సంఘం ముఖ్యనాయకుల సమావేశం ఖమ్మం నగరంలో నిర్వహించారు. ఈసంద ర్భంగా నగరంలోని పలు డివిజన్ల నూతన కమి టీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మా ఓట్లు మాకే అనే నినాదంతో బీసీ లను కలుపుకొని బీసీ, మున్నూరుకాపు కుల స్తుల గెలుపుకోసం కృషిచేయాలని కోరారు. రాజకీయపార్టీలు కూడా బీసీ, మున్నూరుకాపు కులస్తులకు జనాభా దామాషా ప్రకారం ప్రకా రం సీట్లు కేటాయించాలన్నారు. అప్పుడే తమ మద్దతు వారికి ఉంటుందని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో కొత్తసీతారాములు, కనకం జనార్ధన్, మెంతుల శ్రీశైలం, మలిశెట్టి వెంకటే శ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

తిరుమలాయపాలెం, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికాబివృద్ధి సాధించా లని నాబార్డు డీడీఎం సుజిత్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సుబ్లేడులో తెలంగాణ గ్రామీ ణ వికాస్‌బ్యాంక్ స్వచ్ఛతా సేవా హీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా పొదుపు చేయడం అలవర్చుకుని, అభివృద్ధి చెడాలన్నారు. ఈకార్యక్రమంలో ఎల్‌డీఎం రవి, రీజనల్ బ్యాంక్ మేనేజర్ ప్రసన్నకుమార్, బీఎం ఎస్‌కే మున్నా, ప్రకాష్ పాల్గొన్నారు.

అటవీశాఖలో.. ఇంటి దొంగలు

- ఐదు నెలల కాలంలో 200 అక్రమ పర్మిట్లు
- రూ.3వేల మామూళ్ల కోసం రూ.లక్షల అక్రమ కలపకు అనుమతులు



ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా అటవీశాఖలో ఇంటి దొంగల పోరు జాతీయ స్థాయిలోకి వెళ్లింది. కలప అక్రమ రవాణాను అడ్డుకునేందుకు కేం ద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పారదర్శక చర్యలు తీసుకుంటున్నా అటవీశా ఖలో కంప్యూటర్ ఆపరేటర్లు నుంచి బీట్ ఆఫీసర్లు రేంజర్లు వరకు తమ అవినీతి దందాను అటవీశాఖ ఎత్తులకు పై ఎత్తులు వేస్తు న్నారు. తప్పనిసరి పరిస్థితిలో కింది స్థాయిలోని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటున్నారు.

నేషనల్ ట్రాన్స్‌పోర్టు పర్మిషన్‌లో తప్పుడు నమోదులు

అటవీ ప్రాంతంలో లేదా రైతులు తమ వ్యవసాయ భూముల్లో అటవీ సంపదను పెంచి వాటిని అటవీశాఖ నిబంధనల మేరకు అమ్మకాలు జరిపితే గతంలో రాష్ట్ర అటవీశాఖ నుంచి చేతితో రాసి న రశీదు పుస్తకాల ద్వారా అనుమతులు జారీ చేసే వారు. అయి తే అవి ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయిలో కనిపించకపోవడంతో ఇత ర రాష్ట్రాలకు కలప రవాణా సమయంలో గుర్తింపు సమస్యగా ఉండేది. ఈ క్రమంలో గతేడాది క్రితం జాతీయ అటవీశాఖలో మార్పులు చేసి నేషనల్ ట్రాన్స్‌పోర్టు పర్మిషన్ విధానాన్ని రూపొం దించారు. ఆన్‌లైన్‌లోనే చిన్న విధాల పరిశీలించి కలప రవాణాకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఈ క్రమంలో గతం లో గిరిజన ప్రాంతాల్లోని అటవీ ప్రాంతంలో మంజూరు చేసిన రశీదుల వివరాలను తాజాగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి నేషనల్ ట్రాన్స్‌పోర్టు పర్మిషన్‌ను తప్పుదోవ పట్టించి అక్రమ వ్యాపారులకు అటవీశాఖలోని కంప్యూటర్ ఆపరేటర్లు నుంచి బీట్ ఆఫీసర్లు, రేంజ్ ఆఫీసర్లు వరకు అవినీతికి పాల్పడు తున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.

ఇల్లెందు అటవీశాఖలో ఎంతో అనుభవం గడించిన ఎఫ్ఆర్వో కొన్ని నెలల క్రితం బది లీపై ఖమ్మం ఎఫ్ఆర్వోగా వచ్చారు. శాఖలో తనకున్న ఉన్న అనుభవాన్ని అటవీశాఖ అభివృ ద్ధికి కాకుండా అన్నం పెట్టే అటవీశాఖ అవినీతికి ఆలో చన చేశారు. ఎఫ్ఆర్వో లాగిన్ ద్వారా తుది అనుమతి జరుగు తుంది. కాని ఖమ్మం ఎఫ్ఆర్వో వద్ద పనిచేసే ఓ బీట్ ఆఫీసర్ ఏకంగా ఒక సొంత ల్యాప్‌టాప్‌ను పై స్థాయి అధికారి కనుసన్న లతో వినియోగించారు. చింతకాని మండలంలోని ఓ రైతు పట్టా భూమి నుంచి 50సార్లు కలప తరలించినట్లు ఆన్‌లైన్ పర్మిట్లను మంజూరు చేశారు. ఆ కలపను ఇల్లెందు ప్రాంతంలోని కలప వ్యాపారులతో తరలించారు. ఇలా గత ఐదు నెలల కాలంలో 200లకు పైగా పర్మిట్లు పంపిణీ జరిగాయని తెలుస్తోంది. అయితే పర్మిట్‌లో మాత్రం వేప వంటి సాధారణ కలప ఉండగా, రవా ణాలో మాత్రం విలువైన టేకు, సండ్ర, ఇతర కలప తరలించ టంతో మధ్య ప్రదేశ్‌లోని ఓ డీఎఫ్వో ఖమ్మం జిల్లాలోని అవినీతి డొంక తీగ లాగారు.

అటవీశాఖలోని అధికారుల కేవలం రూ.3వేలు తీసుకొని అక్ర మ అనుమతులు ఇవ్వటంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రూ.లక్షల విలువైన కలప అక్రమ రవాణా జరిగినట్లు విమర్శలు వెలువడుతున్నాయి.

పలుకుబడి పోస్టింగ్‌లు.. ఆపై అవినీతి

గత ప్రభుత్వంలో మాజీ మంత్రి అనుచరులుగా ఉన్న అటవీశాఖలో అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌కు గురైన అధికారులు, తమ పలుకుబడి ఉపయో గించుకొని తిరిగి ఖమ్మంలోనే పోస్టింగ్‌లు పొందుతూ పదే పదే అవినీతికి పాల్పడుతు న్నారు. నేలకొండపల్లిలో అవినీతికి పాల్పడిన ఓ మహి ళా అధికారి సస్పెన్షన్‌కు గురయ్యారు. తర్వాత ఆమె కు భద్రాద్రి జిల్లాలో తిరిగి ఉద్యోగం ఇచ్చారు. కాని ఆమె పైరవీలు చేసి తిరిగి చింతకాని మండలానికి పోస్టింగ్ ఇప్పించుకున్నారు. ఖమ్మం రేంజి, మధిర రేంజీలోని కంప్యూటర్ ఆపరేటర్లు నుంచి బీట్ ఆఫీసర్ల వరకు కలప అనుమతుల విషయంలో అవినీతికి పాల్పడుతున్నా రని విమర్శలు వెలువడుతున్నాయి. ఒక్కో చెట్టుకు రూ.500 నుంచి రూ.2వేల వరకు కలప రకాన్ని బట్టి వసూళ్లు చేస్తున్నారు. మధిర రేంజీలోని ఓ కంప్యూటర్ ఆపరేటర్ పై మామూళ్ల నెలకు రూ.50వేలకు పై మాటే ఉన్నట్లు అటవీశాఖలో చర్చ జరుగు తుంది. కాగా చింతకాని మండలంలో జరిగిన సంఘటనపై జిల్లా అటవీశాఖ అధికారి ఒక బీట్ ఆఫీసర్ ల్యాప్‌టాప్‌తో పాటుగా సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టారు.

బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

కలప అక్రమ రవాణాకు సంబంధించి తప్పుడు వే బిల్లులు తయారు చేయించిన చింతకాని బీట్ ఆఫీసర్ శ్రీకాంత్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాంత్ 5 నెలలుగా నకిలీ పర్మిట్లు ఇచ్చినట్లు డీఎఫ్వో సిద్దార్థ సింగ్ జరిపిన విచారణలో వెల్లడైంది.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

- బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి జిల్లా డీజీఎం రాజశేఖర్‌బాబు

ఖమ్మం మామిళ్లగూడెం, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించినప్పుడే ఆదరణ లభిస్తుందని బీఎస్ఎ న్ఎల్ ఉమ్మడి ఖమ్మం జిల్లా డీజీఎం రాజశేఖర్ బాబు అన్నారు. బుధవారం బీఎస్ఎన్ఎల్ రజ తోత్సవ వేడుకలను జీఎం కార్యాలయంలో నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ గతంలో మాదిరిగానే బీఎస్ఎన్ఎల్ సంస్థ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు కొత్త పథకాలతో ముందుకు వస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ స్థాపించి 25 ఏళ్ల పూర్తయిందని ఇదే స్ఫూర్తితో మరిన్ని విశిష్ట సేవలను అందించనున్నట్లు తెలిపారు. పూర్తి స్వదేశీ సాంకేతికతతో పని చేసే లక్ష లాది 4జీ టవర్లను బుధవారం అధికారికంగా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని ప్రదేశాలలో కలిపి 412 టవర్స్ ద్వారా 4జీ ససేవలను ప్రజలకు అంది స్తున్నట్లు తెలిపారు.ఇంటర్నెట్, ఎఫ్‌టీటీహెచ్ ఛానల్స్ లాంటి సేవలను, భారత్ ఫైబర్ ద్వారా షుమారు 7000 మంది కస్టమర్ లకు ఇంటర్నెట్ సేవలను అందిస్తున్నట్లు వివరిం చారు. ఈ సందర్భంగా ఉద్యోగులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

స్థానిక పోరులో కలిసివచ్చే పార్టీలతో పొత్తు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రసాద్

నేలకొండపల్లి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): స్థానిక సమరంలో కలిసివచ్చే పార్టీలతో సీపీఐ గౌరవప్రదమైన పొత్తు పెట్టుకుంటుందని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కర్నాటి భానుప్ర సాద్ కార్యకర్తలకు స్పష్టం చేశారు. బుధవారం నేలకొం డపల్లిలోని కర్నాటి భవన్‌లో జరిగిన సీపీఐ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి వచ్చే శక్తులతో ముందుకు సాగుదామని, తద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేసి పార్టీని విస్తరించాలని కార్య కర్తలను కోరారు. గతంలో గెలిచిన స్థానాలతో పాటుగా వీలైనన్ని కొత్త స్థానాలలో పోటీకి చర్యలు తీసుకుంటామన్నారు. భైరవునిపల్లి, నాచేపల్లి, మంగాపురంతండా, నేలకొండపల్లిల్లోని ఎంపీటీసీ స్థా నాలకు ఖచ్చితంగా పార్టీ పోటీలో ఉంటుందన్నారు. సమావేశంలో కనకబండి సీతరాములు, మారి శెట్టి వెంకటేశ్వరరావు, మల్లెబోయిన ఉపేందర్, అయోధ్య, రాయల మాధవరావు, పాల్గొన్నారు.

ప్రతీ ఇంట్లో ఆనందం నింపాలి: కోటేశ్వరరావు



ఖమ్మంబైపాస్‌రోడ్, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ప్రజలకు విజయదశమి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వర రావు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈపండుగ ప్రతి ఇంటిలో ఆనందం నింపాలని , శాంతి సమృద్ధి, సౌఖ్యం ప్రతి కుటుంబంలో వెల్లివి రియాలని కోరారు.

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వేంసూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వేంసూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. 2002-2003 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ గత జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఆ తర్వాత విద్యార్థులంతా సహపంక్తి భోజనాలు చేశారు. ఆ తర్వాత ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు.

కారు, బైక్ ఢీ : వ్యక్తి మృతి



కృష్ణారావు(ఫైల్)

కారేపల్లి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): కారు, మోటర్ సైకిల్ ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని రావోజీ తండా వద్ద బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం పేరుపల్లి గ్రామానికి చెందిన సిరికొండ కృష్ణారావు(36) కారేపల్లి మండల కేంద్రం నుంచి స్వగ్రామం పేరుపల్లికి వస్తున్న క్రమం లో పేరుపల్లి నుంచి కారేపల్లికి వస్తున్న కారు వేగంగా వచ్చి కృష్ణారావు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో కృష్ణారావుకు తీవ్రగాయాలు కావడంతో పాటు అతని కాలు పూర్తిగా విరిగి బొక్క కాలు నుంచి పూర్తిగా విడిపోయి కారులో ఇరుక్కుపోయింది. దీంతో కృష్ణారావును స్థానికులు 108 వాహనంలో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో అతను చికిత్స పొందుతూ మృతిచెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

కంకర టిప్పర్ బోల్తా..

చింతకాని, అక్టోబరు 1 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని తిరు మలాపురం గ్రామ సమీపంలో మత్కేపల్లి-తిరుమలాపురం రోడ్‌పై కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడింది. కొత్తగా దారి నిర్మాణ పనుల కొరకు కంకరను తీసుకెళ్తున్న టిప్పర్ బురద వలన మట్టి రోడ్డుపై అదుపుతప్పి పక్కనున్న పత్తి పొలంలో పడిపోయింది. ప్రమాదం నుండి డ్రైవర్ తృటిలో బయటపడ్డాడు.

అర్ధరాత్రి పిచ్చికుక్క స్వైరవిహారం

ఒకే సమయంలో ఐదుగురిపై దాడి



పిచ్చికుక్క దాడిలో గాయపడిన సామ్రాజ్యం

ఎర్రుపాలెం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలం లోని బంజర గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి పిచ్చి కుక్క స్వైరవిహారం చేసి ఒకే సమయంలో ఐదుగురిని కరవడంతో తీవ్రంగా గాయలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలప్రకారం గ్రామంలో గజ్జి సామ్రాజ్యం అనే మహిళ ఇంటి బయట ఆవరణలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఓ పిచ్చికుక్క మీదపడి తీవ్రం గా కరిచింది. కుక్క నుంచి తప్పించుకుని అరవడంతో పక్క ఇంటిలో నిద్రిస్తున్న తన తల్లి సుంకర సావిత్రి లేచి కుక్కను తప్పించే క్రమంలో ఆమెను కూడా తీవ్రంగా గాయపరిచింది. అక్కడ నుంచి పారిపోయి మరో పక్కన ఇంటిలో నిద్రిస్తున్న కందుకూరి ప్రసన్న అతని భార్య, కుమారుడిని కూడా తీవ్రంగా గాయపరిచి పరారయింది. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం వారి కుటుంబసభ్యులు అంబులెన్సు ద్వారా ఖమ్మం ప్రభు త్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో సామ్రాజ్యం పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని అధికారులు స్పందించి కుక్కల బారినుంచి గ్రామస్తులను కాపాడాలని స్థానికులు కోరారు. ఈ మేరకు బాధితులను అధికారులు ఆదుకోవాలని గ్రామస్తులు తెలిపారు.

'పల్లెపోరు'పై గురి..

(5వ పేజీ తరువాయి)

శ్రీనివాసరెడ్డి తమ నియోజవర్గాల్లో కార్యక ర్తలతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. జడ్పీ టీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ అభ్యర్థుల ఎంపికపై కూడా స్థానికంగా నియామక కమిటీలు నియ మించి పేర్లను పరిశీలనకు తీసుకున్నారు.

సన్నద్ధమవుతున్న బీఆర్ఎస్

బీఆర్ఎస్ పార్టీ కూడా స్థానిక సంస్థల ఎన్ని కలకు సన్నద్ధమవుతోంది. రెండు జిల్లాల్లో జిల్లా కమిటీలు, మండలకమిటీలు సమావే శమై గ్రామాల్లో అభ్యర్థులను బరిలో దించేం దుకు సిద్ధమవుతున్నారు. కలిసొచ్చే పార్టీలతో పొత్తులకు సై అని సంకేతాలు పంపుతున్నారు. సీపీఎంతో మైత్రీ బంధానికి బీఆర్ఎస్ ప్రయ త్నిస్తోంది. ఇటీవల ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూధ న్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్‌రెడ్డి వేర్వేరుగా సమావేశమై ఎన్నికలకు సిద్ధం కావాలని కేడర్‌కు పిలుపుని చ్చారు. దీంతో కొన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ కేడర్ స్తబ్ధుగా ఉండగా కొన్ని గ్రామాల్లో అధికార కాంగ్రెస్‌కు పోటీ ఇచ్చేలా ఎన్నికలకు అభ్యర్థు లను సిద్ధంచేస్తున్నారు.

ఎటూ తేల్చుకోని వామపక్షాలు

ఉమ్మడి జిల్లాలో స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రతిసారి వామపక్షాలు కూడా తమ ఉనికి చాటుకుంటూ వస్తున్నాయి. సర్పంచ్‌లు, ఎంపీ టీసీలు తదితర పదవులను గతంలో కైవసం చేసుకున్నారు. జడ్పీటీసీ, ఎంపీపీలు గెలిచారు. రాష్ట్ర విభజన తర్వాత జిల్లా పరిషత్‌లో వామ పక్షాల ప్రాతినిధ్యం దెబ్బతింది. అయితే ఈసారి వామపక్షపార్టీలు ఎవరికివారు ఎన్ని కలు సిద్ధమని ప్రకటనలు ఇస్తూ సమావే శాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మంలో నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన ఇటీవల జిల్లానాయ కులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అయితే పొత్తు ఎవరితో ఉంటుందన్న విషయం సీపీఎం తేల్చలేదు. ఒంటరి పోటీనా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో కొత్తబంధం ఉంటుం దా? అన్నది ఇంకా ఆ పార్టీ నిర్ణయం తీసుకో లేదు. అయితే ఎన్నికల్లో తమకు లాభం జరి గేలా పొత్తు ఉండాలన్నది సీపీఎం ఆకాంక్ష. సీపీఐ విషయానికి వస్తే కాంగ్రెస్‌తో సీపీఐ పొత్తులో ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రెండు పార్టీలుకలిసి పోటీచేశాయి. దీంతో అదే పొత్తు స్థానిక ఎన్నికల్లో కూడా కొనసాగనుంది. ఇక పోటీచేసే స్థానాల విషయంలో కాంగ్రెస్‌తో ఇబ్బందులు తలెత్తే అవకాశం లేకపోలేదు. పాలేరు, కొత్తగూడెం, మధిర, పినపాక, భద్రా చలం నియోజకవర్గాల్లో సీపీఐ తమకు పట్టున్న గ్రామాల్లో తమకు సీటు కేటాయించా లని కాంగ్రెస్ వద్ద ప్రతిపాదన పెట్టింది. అయితే కాంగ్రెస్ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి చర్చలు జరగలేదు. ఇక బీజేపీ, టీడీపీ విషయానికి వస్తే స్థానిక ఎన్నికలకు సిద్ధమని ప్రకటిస్తున్నాయి. అయితే 8వతేదీ హైకోర్టు తీర్పును బట్టి స్థానిక ఎన్నికల రంగం లోకి దిగే విషయంలో ఓ నిర్ణయం తీసుకోవా లన్న యోచనలో ఈ రెండు పార్టీలున్నాయి. అధికార, విపక్షపార్టీలు కూడా హైకోర్టు తీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. ఆ తర్వాత మార్పులు, చేర్పులపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశం ఉంది.

బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఉసిరికాయలపల్లిలో బతకమ్మఆడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

కారేపల్లి, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఉసిరికాయలపల్లి కోటమ్మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం రాత్రి జరిగిన సద్దుల బతకమ్మ సంబరాల్లో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహిళలు ఆడుతున్న బతకమ్మ ఆటలో పాల్గొని వారితో కలిసి పాటలు పాడుతూ సందడి చేశారు. కార్యక్రమం లో ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ డాక్టర్ పర్సా పట్టాబి రామారావు, పగడాల మంజుల, ఈవో వెణుగోపాల చార్యులు కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు

మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అనేక మంది మహిళ ఉద్యోగులు పాల్గొని సద్దులబతకమ్మ ఆడారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఎంపీవో రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని సాయిగణేష్ నగర్ వద్ద బైపాస్‌రోడ్డుపై మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 55 ఏళ్ల వయసు కలిగిన ఓ గుర్తు తెలియని వ్యక్తి రెడ్ కలర్ టీషర్ట్, బ్లూ అండ్ వైట్ లైన్స్ లుంగీ కలిగి ఉన్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రోడ్డుపై పడి ఉన్న వ్యక్తిని గుర్తించని వాహనాలు తొక్కించడంతో మృతదేహం ఛిద్రమైంది. అన్నం శ్రీనివాస్ సహాయంతో రోడ్డుపై ఉన్న మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఈ దసరా.. రైతులకు విజయం చేకూర్చాలి

పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈ విజయదశమి రాష్ట్ర రైతులకు మరింత విజయాన్ని అందించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. రైతులు, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిపాలనలో దేశంలో వరితో పాటు ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని, రాష్ట్ర రైతులు దేశానికే ఆద ర్శంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగును ప్రభు త్వం ప్రోత్సహిస్తోం దని, రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు రైతులకు అవసరమైన సహకారం అందిస్తోందని, ఫలితంగా ఇప్పటికే 2.70లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోందన్నారు. రాబోయే మూడేళ్లలో పదిలక్షల ఎకరాల్లో సాగు చేయించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతులు ముందుకు రావాలని కోరారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన భట్టి, పొంగులేటి

విజయదశమి పర్వదినం సందర్భంగా ప్రజలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్ర మార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా శుభాకాంక్షలు తెలి పారు. ఈ విజయదశమి అందరి జీవితాల్లో ఆనందం నింపాలని, విజయాలను అందించాలని ఆకాంక్షించారు. అభివృద్ధిలో రాష్ట్రం ముందుకు పోతోందని వారు తమ ప్రకటనల్లో పేర్కొన్నారు. వీరితో పాటు ఎంపీ రఘురాంరెడ్డి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కూడా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

దసరా వచ్చిందయా..

(5వ పేజీ తరువాయి)

స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామిని ప్రజలు దర్శించుకోవం ఆనవా యితీ. గురువారం సాయంత్రం గుట్ట ఆలయం నుంచి ప్రత్యేక పల్లకీలో ఊరేగింపుగా స్వామి వారు బయలుదేరి జమ్మిబండకు చేరుకుంటారు. పారువేట, శమీపూజ, స్వామి దర్శనం అనంతరం రాత్రి స్వామి వారిని తిరిగి గుట్టపైకి తీసుకెళ్తారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల గకుండా దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ ఈవో కొత్తూరు జగన్ మోహన్‌రావు, ఆలయ అర్చకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్తంభాద్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో క్యూలైన్లు, భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ నిర్వహిస్తారు. దసరా నాడు ఆయుధపూజ, పొలిమేర దాటడం, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం ప్రధాన ఆచారాలుగా కన్పిస్తాయి. అయితే పాలపిట్టను బంధించడం చట్టరీత్యా నేరం కావడంతో జమ్మి బండ వద్ద పాలపిట్ట దర్శనాన్ని కొన్నేళ్లుగా ఆలయ అధికారులు నిలిపివేశారు. ఇక పలు కారణాలతో రెండేళ్లుగా రావణవధను నిలిపివేశారు.

డివైడర్‌ను ఢీకొట్టి మహిళ మృతి



కిరణ్మయి (ఫైల్)

ఖమ్మంక్రైం, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): డివైడర్‌ను ఢీకొట్టి మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం ఖమ్మం నగరంలో జరిగింది. ఖానాపురంహవేలి పోలీసుల కథనం ప్రకారం మమతా రోడ్డులోని ఓ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న అనుమోలు కిరణ్మయి(34) తన ఇద్దరు పిల్లలతో కలిసి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో మమతారోడ్డులో దేవాలయానికి వెళ్లేందుకు ద్విచక్రవాహనంపై బయటకు వచ్చారు. దీంతో ద్విచక్రవాహనంపై డ్రైవింగ్ చేస్తున్న కిరణ్మయి ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో తన ఇద్దరు పిల్లలతో సహా ఆమె డివైడర్‌కు తగిలి తీవ్రగాయాలయ్యాయి. స్థానికు లు సమీపంలోని ఓ ఆస్పత్రికి తరలించిగా చికిత్స పొందుతూ కిరణ్మయి మృతిచెందింది. ఈ ఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.



ఘనంగా దుర్గామాత నిమజ్జనం

కారేపల్లి, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాలను బుధవారం రాత్రి నిమజ్జనం చేశారు. పది రోజుల పాటు భక్తుల చేత పూజలందుకున్న అమ్మవారిని భక్తులు ఊరేగింపులతో.. నృత్యాలు చేస్తూ గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా యువతీ యువకులు సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం సమీపంలోని చెరువుల్లో, వాగుల్లో నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో.. సందడి నెలకొంది. కాగా.. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ఘర్షణలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.







స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు
మండల ప్రత్యేక అధికారులు వీరే..

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ కోసం వాటి పరిశీలన కోసం మండల ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ నియమించారు. 20మండలాలకు 20 మందిని నియమించారు.

మండలం	అధికారి	సెల్ నెంబర్
బోనకల్	విజయభాస్కర్‌రెడ్డి	9492555259
చింతకాని	కె నవీన్‌బాబు	8074821137
ఏన్కూరు	రాంకోటినాయక్	9440525928
కల్లూరు	పుష్పలత	9100122240
కామేపల్లి	ఎంవీ మధుసూదన్	8977714101
ఖమ్మం రూరల్	జి జ్యోతి	9618455722
కొణిజర్ల	కె రాంగోపాల్‌రెడ్డి	8121865272
కూసుమంచి	జి శ్రీలత	7995050741
మధిర	బి శ్రీనివాస్	9492625009
ముదిగొండ	మహేష్	9701454888
నేలకొండపల్లి	కె రవిబాబు	9948663984
పెనుబల్లి	డి శ్రీనివాసులు	9848412537
రఘునాథపాలెం	ఎండీ ముజాహిద్	8374396005
సత్తుపల్లి	వనశ్రీ	9100122237
సింగరేణి	కె చందన్‌కుమార్	8008301458
తల్లాడ	జి శివప్రసాద్	9951096622
తిరుమలాయపాలెం	రమేష్	7702206363
వేంసూరు	వి శ్రీనివాసరెడ్డి	8977748722
వైరా	కె బాబూరావు	9949094585
ఎర్రుపాలెం	స్వర్ణ విజయచంద్ర	8977746574

వాయిదా లేకుండా ఎన్నికలు
నిర్వహించాలి
సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



ఖమ్మం అర్బన్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికలు వాయిదా వేయకుండా ఇకనైనా నిర్వహించాలని.. సకాలంలో స్థానిక ఎన్నికలు జరగక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాక గ్రామాల్లో పాలన పడకేసిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం అన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన సీపీఎం జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీలకు మూలమైన ప్రజాప్రతినిధులు లేక పోవడం వల్ల పాలనలో పూర్తి శూన్యత ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో.. పాలనా వ్యవస్థ గాడి తప్పిందన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు లేక పోవడం వల్ల మౌలిక వసతుల కల్పన, సమస్యల పరిష్కారం అగమ్యగోచరంగా మారిందన్నారు. గ్రామ పంచాయతీల్లో పాలక వర్గాలు లేక.. స్థానిక సమస్యలు పరిష్కారం కాక.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజల్లో ఆగ్రహం పెల్లుబుకుతోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా భావ సారూప్య పార్టీలతో.. లౌకిక ప్రజాస్వామిక శక్తులతో.. వామపక్ష పార్టీలతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ముందుకు పోతామన్నారు. నిత్యం ప్రజల పక్షాన నిలుస్తూ ప్రజా సమస్యలపై పోరాటం చేసిన చరిత్ర సీపీఎంకే ఉందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే సీపీఎం అభ్యర్థులను గెలిపించాలని తమ్మినేని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదినేని రమేష్, భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, ఎర్ర శ్రీనివాస్, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.





అదిరింపులు.. బెదిరింపులు!

- పెట్రోల్ బాటిళ్లను వెంట తెచ్చుకున్న వ్యాపారులు
- ఉద్రిక్తత నడుమ 210 దుకాణాలకు మార్కింగ్
- మార్కెటింగ్ ఈవోపై దాడి ఘటనలో పోలీసుల విచారణ


వాగ్వాద దృశ్యం

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా అద్దెలు ఇవ్వకుండా.. ఒకే దుకాణంలో కదలకుండా ఉంటూ వ్యాపారం చేస్తున్న కొంతమంది కూరగాయల వ్యాపారులు ఇప్పుడు వారి వ్యాపార స్థావరాలు, కుటుంబ సభ్యులతో ఉన్న బినామీ దుకాణాల స్థానాలు కదులుతాయని అదిరింపులు, బెదిరింపులు, కవ్వింపులకు పాల్పడుతున్నారు. ఖమ్మం నగరంలోని వీధి వ్యాపారుల ప్రాంగణం పారదర్శకంగా నిర్వహించేందుకు ఖమ్మం నగర పాలకసంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య తీసుకున్న చర్యలు తుది దశకు చేరుకున్నాయి. వీధి వ్యాపారుల ప్రాంగణంలో అందుబాటులో ధరలతో పాటు వీధి వ్యాపారులకు పారదర్శకంగా దుకాణాలను కేటాయించేందుకు వారం రోజులుగా పునర్ వ్యవస్థ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే బుధవారం మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఎస్టేట్ అధికారి శివరామకృష్ణ ఆధ్వర్యంలో కూరగాయల దుకాణాలకు రెండో రోజూ నెంబర్లు కొనసాగించారు. ఈ క్రమంలో ఓ మహిళా వ్యాపారి తన దుకాణానికి హద్దుల విషయంలో సమీపంలోనే ఉన్న మరో వ్యాపారితో గొడవ పడ్డారు. ఈ క్రమంలో అధికారుల సమక్షంలోనే ఆమె ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. విషయం గమనించిన మెప్మా టీఎంసీ వెంటనే ఆర్పీలు, డీఆర్ఎఫ్ బలగాలతో ఆ మహిళను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన జరిగిన కొద్ది సమయానికే మరో మహిళ గొడవ చేసి తాను పురుగుల మందు తాగుతా.. అంటూ డబ్బాను చూపించి హల్‌చల్ చేశారు. దీంతో మెప్మా, మార్కెటింగ్ అధికారులు ఆ మహిళకు నచ్చజెప్పి ఎవ్వరి దుకాణాలు పోవని.. వ్యాపార పారదర్శకత కోసమే తాము నెంబర్లు, దుకాణాలకు హద్దులు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సాయంత్రం వరకు మెప్మా, మార్కెటింగ్ అధికారులు 210 కూరగాయల దుకాణాలకు హద్దులతో పాటు నెంబర్లను కేటాయించారు.

● మార్కెట్‌లో పోలీసుల విచారణ

మార్కెట్ ఎస్టేట్ అధికారి శివరామకృష్ణపై ఇటీవల ఓ వ్యాపారి కుమారుడు దాడి చేయడంతో.. పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ఖమ్మం రెండో పట్టణ ఎస్సై తన సిబ్బందితో మార్కెట్‌కు చేరుకున్నారు. ఈనెల 28న వీధి వ్యాపారుల మార్కెట్‌లో జరిగిన వివాదంపై విచారణ చేపట్టారు. ఆ సమయంలో ఉన్న ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం నమోదు చేసుకున్నారు. కాగా.. వీధి వ్యాపారుల ప్రాంగణంలో దుకాణాల నెంబర్లు కేటాయింపు సందర్భంగా వివాదాలు ఏర్పడడంతో.. మూడు రోజుల పాటు పోలీసు భద్రత కల్పించాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య మంగళవారం ఖమ్మం రెండో పట్టణ పోలీసులను కోరారు. కానీ బుధవారం పోలీసు భద్రత ఏర్పాటు కాకపోవడంతో.. ఓ మహిళ పెట్రోల్ పోసుకోవడం.. మరో మహిళ పురుగుల మందు డబ్బాతో బెదిరింపులకు పాల్పడ్డారన్న విమర్శలు వెలువడుతున్నాయి. ముందస్తు బెదిరింపు ఆలోచనలతోనే కొంత మంది వ్యాపారులు తమ వెంట పెట్రోల్, పురుగుల మందు డబ్బాలను వెంట తెచ్చుకుంటున్నట్టు పలువురు చెబుతున్నారు. ఇకనైనా పోలీసులు వీధి వ్యాపారుల ప్రాంగణంలో బందోబస్తు ఏర్పాటు చేయాల్సి ఉంది.





- ఖమ్మం ● రఘునాథపాలెం
- ఖమ్మం రూరల్
- తిరుమలాయపాలెం
- కూసుమంచి
- నేలకొండపల్లి ● కామేపల్లి

ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి

» మాస్టర్ ట్రైనర్ జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్



శిక్షణకు హాజరైన అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్ అన్నారు. బుధవారం డీపీఆర్సీ భవనంలో నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులకు, మాస్టర్ ట్రైనర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు వారి పరిధిలో గల విధులు, హక్కుల, నిబంధనల గురించి సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరు తమకు కేటాయించిన హ్యాండ్ బుక్ ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని, ముఖ్యమైన నిబంధనలు మార్క్ చేసి పెట్టుకోవాలని అన్నారు.మనకు కేటాయించిన హ్యాండ్ బుక్ ఎంతో ప్రధానమైనదని, అందులోని నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలని అన్నారు. రిటర్నింగ్ అధికారులు నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ గుర్తుల కేటాయింపు ప్రక్రియ జాగ్రత్తగా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

దేవీనవరాత్రుల వేడుకలు

» మహిసాసుర మర్ధిని అమ్మవారిగా దర్శనం



మహిషాసురమర్దిని దేవి అలంకరణలో మారెమ్మతల్లి అమ్మవారు



స్థంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవీగా దర్శనమిచ్చిన అమ్మవారు

ఖమ్మం ఖానాపురంహవేలి/ ఖమ్మం రూరల్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవీనవరాత్రుల వేడుకలు నేటితో (గురువారంతో) ముగియనున్నాయి. చివరి రోజు అమ్మవారు రాజరాజేశ్వరి అమ్మవారిగా భక్తులకు దర్శినమిస్తారు. అనంతరం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేయనున్నారు. తొమ్మిదవ రోజు బుధవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అన్నదానాలు నిర్వహించారు.



జమ్మిబండ వద్ద

తండాల్లో రిజర్వేషన్లు లంబాడీలకే కేటాయించాలి

ఖమ్మం అర్బన్ అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తండాల్లో రిజర్వేషన్లు లంబాడాలకే కేటాయించాలని ప్రభుత్వం విడుదల చేసిన రిజర్వేషన్లు గందరగోళంగా ఉన్నాయని సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ ఖమ్మం డివిజన్ కార్యదర్శి ఝాన్సీ లక్ష్మి అన్నారు. బుధవారం రాంక్యాతండాలో నిర్వహించిన సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎస్టీలు అధికంగా ఉన్నతండాల్లో బీసీ రిజర్వేషన్లు, బీసీలు అధికంగా ఉన్న చోట ఎస్టీలకు కేటాయించటం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవటం కోసం బీసీ స్థానాలను అధికంగా చూపిందన్నారు. కార్యక్రమంలో మాస్ లైన్ డివిజన్ నాయకులు మేక రామనాదం, జరపల దేవ్లా,ధరావత్ లక్ష్మణ్, కేశోత్ పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



విద్యార్థినికి చెక్కు, మెమోంటో అందిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంఖానాపురంహవేలి/ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): డోర్నకల్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చెరుకుపల్లి విశాలి విద్యకు సీతారత్నం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పరిశ పుల్లయ్య ఆర్థిక సహాయం అందించారు. బుధవారం నగరంలోని ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ఎస్వీ రమణమూర్తి చేతుల మీదుగా రూ.20 వేల చెక్కును విదార్థినికి అందించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ క్రమ శిక్షణతో ఉన్నతస్థానం సాధించాలని విద్యార్థినికి సూచించారు. తల్లిదండ్రులను, విద్యార్థినిని, ట్రస్ట్ ఛైర్మన్‌ను అభినందించి మెమోంటో అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లితండ్రులు నాగబాబు, స్వరూప, విశ్రాంత హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప వల్లి తదితరులు పాల్గొన్నారు.

గువ్వలగూడెం కార్యాలయం టీడీపీదే

» టీడీపీ జిల్లా నాయకుడు కొండబాల



మాట్లాడుతున్న కొండబాల కరుణాకర్

నేలకొండపల్లి, అక్టోబరు1(ఆంధ్రజ్యోతి):తప్పుడు కేసులు పెట్టించే సంస్కృతి పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాళ ఉపేందర్‌రెడ్డిదేనని, అప్పుడే గతాన్ని మర్చిపోయి ఎదుటి వారి మీద బురద చల్లితే ఎవరూ ఊరుకోరని టీడీపీ జిల్లా నాయకుడు, పాలేరు ఇన్‌చార్జి కొండబాల కరుణాకర్ విమర్శించారు. బుధవారం నేలకొండపల్లిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గువ్వలగూడెంలో నిర్మాణంలో ఉన్నది ముమ్మాటికీ తెలుగుదేశం పార్టీ కార్యాలయమేనని, దాన్ని దొంగ కాగితాలు సృష్టించి కబ్జా చేయటానికి ప్రయత్నించిన వ్యక్తులపై పోలీసులు కేసులు పెట్టి, రిమాండ్‌కు పంపారని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. తెలుగుదేశం ఎక్కడుందని ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతున్నాడని, పాలేరులో టీడీపీ దెబ్బకు దిమ్మ తిరిగినా ఇంకా బుద్ధి రాలేదని ఎద్దేవా చేసారు. గువ్వలగూడెం టీడీపీ కార్యాలయానికి 2010లో తెలుగుదేశం ఎంపీగా ఉన్న నామా నాగేశ్వరరావు శంకుస్థాపన చేసిన విషయాన్ని కొండబాల గుర్తు చేశారు. సమావేశంలో ఆరెకట్ల కొండలరావు, కొప్పుల నాగేశ్వరరావు, నలమాస మల్లయ్య, వీసం శ్రీనివాసరా వు, కోలేటి మస్తాన్ రావు, మద్దినేని మహేష్, తలశీల ఈశ్వరరావు తీగ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ZONE
గురువారం 2 అక్టోబరు 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి



ఎన్నికల విధుల నుంచి వ్యవసాయశాఖ అధికారులను మినహాయించాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల విధుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులను మినహాయించాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సుల అమలు కోసం దేశవ్యాప్త రైతు ఉద్యమానికి పిలుపునిచ్చారు. వైరా మునిసిపాలిటీ పరిధిలోని గండగలపాడులో బుధవారం నిర్వహించిన హరిత విప్లవ పితామహుడు డాక్టర్ స్వామినాథన్ శత జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూరియా అందక రైతులు అవస్థలు పడుతున్నారని ఈ తరుణంలో వ్యవసాయ శాఖ అధికారులు ఎన్నికల విధు ల నిర్వహణకు వెళితే సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అందువలన ఎన్నికల విధుల నుంచి వ్యవసా యశాఖ అధికారులను మినహా యించాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం నాయకులు మల్లెంపాటి ప్రసాదరావు, చిత్తారు మురళీ, కామినేని రవి, వాసిరెడ్డి విద్యాసాగర్‌రావు, ఇమ్మడి వీరభద్రం, సుధీర్, మచ్చా మణి తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నప్రసాద కార్యక్రమం

పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి



అమ్మవారి పూజలో పాల్గొన్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కల్లూరులోని పుల్లయ్యబంజర వీధిలో గల అమ్మవారి మండప కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన మహాఅన్నప్రసాద కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్లూరులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల మండపంలో అమ్మవారిని కూడా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమంలో మండప కమిటీ నిర్వాహకులు చిత్తలూరి నరేష్, సముద్రాల పుల్లారావు, పసుమర్తి రాంబాబు, చారుగుండ్ల అచ్యుత సీతారామారావు, వేముల శ్రీనివాసరావు, ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజదేవి, లక్కినేని కృష్ణ, పోట్రు అర్జునరావు, లక్కినేని రమేష్, ఏనుగు సత్యంబాబు, తల్లపురెడ్డి హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాగమయి

తల్లాడ : మండలంలోని మల్సూర్‌తండాలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఏఎంసీ ఛైర్మన్ బాగం నీరజ, వైస్ ఛైర్మన్ కాపా సుధాకర్, యువజన కాంగ్రెస్ నాయకుడు కటికి కిరణ్, మాలోత్ కృష్ణ, హాన్సేన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీటు సాధించిన పేద విద్యార్థికి సూరంపల్లి అభినందన



గురుమణికంఠను అభినందిస్తున్న సూరంపల్లి రామారావు

కొణిజర్ల, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబంలో పుట్టి, పట్టుదలతో ఎంబీబీఎస్ సీటు సాధించిన మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన పత్తి లాలయ్య, తిరుపమ్మ కుమారుడు గురు మణికంఠను బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు శాలువాతో సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టినప్పటికీ గురుమణికంఠకు డాక్టర్ చదవాలనే కోరిక ఉండడంతో తండ్రి కష్టపడుతూ కుమారుడిని మెడికల్ వైపు ప్రోత్సహించాడు. గురుమణికంఠ కూడా ఎంబీబీఎస్ సీటు సాధించడంతో తల్లిదండ్రుల్లో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గురు మణికంఠకు ఉచిత ఎంబీబీఎస్ సీటు వచ్చింది. ఈ సందర్భంగా మణికంఠను సన్మానించిన సూరంపల్లి అతన్ని అభినందిస్తూ వైద్య విద్యలో మంచిగా, శ్రద్ధగా చదవి రాణించాలని తెలిపారు. సన్మానించిన వారిలో సూరంపల్లితో పాటు 'ఆత్మ' కమిటీ మాజీ ఛైర్మన్ కోసూరి శ్రీను, గూడె ఉపేందర్‌రావు, సీపీఐ మండల కార్యదర్శి గడల బాస్కరరావు, యాస వెంకటేశ్వరరావు, గడల శ్రీను తదితరులు శాలువాతో సన్మానించి అభినందించారు.

ఏసీపీ రెహ్మాన్‌కు వీడ్కోలు సన్మానం



రెహ్మాన్ దంపతులను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

వైరా, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): వైరా ఏసీపీ ఎం.ఏ.రెహ్మాన్ వీడ్కోలు సన్మాన కార్యక్రమం మంగళవారం రాత్రి స్థానిక కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించారు. రెండున్నర ఏళ్లకు పైగా రెహ్మాన్ వైరా ఏసీపీగా అందించిన సేవలను అడిషనల్ డీసీపీలు ప్రసాదరావు, రామానుజం కొనియాడారు. వైరా సబ్‌డివిజన్‌లో కేసుల పరిష్కారానికి ఆయన చూపిన చొరవను అభినందించారు. అనంతరం రెహ్మాన్ దంపతులను పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ కుమారస్వామి, ఏసీపీలు సాంబరాజు, సర్వర్‌పాషా, వైరా, మధిర సీఐలు ఎన్.సాగర్, మధు, వైరా ఎస్ఐ పుష్పాల రామారావు, సబ్‌డివిజన్‌లోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న పీఆర్ అధికారులు

చింతకాని, అక్టోబరు1 (ఆంధ్రజ్యోతి): మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబటి వెంకటేశ్వర్లును బుధవారం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు ఆయన స్వగృహం నాగులవంచలో మర్యాదపూర్వకంగా కలిశారు. సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటరెడ్డి, డీఈ శ్రీనివాసరావు, రిటైర్డ్ డీఈ కోటేశ్వరరావు, బోనకల్ ఏఈ నవీన్, కాంట్రాక్టర్ సంక్రాంతి ప్రసాద్ పాల్గొన్నారు.

ఊరేగింపులో డీజేలకు అనుమతిలేదు : సీఐ సాగర్



నిర్వాహకులతో మాట్లాడుతున్న సీఐ సాగర్

చింతకాని, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రుల సందర్భంగా విగ్రహాల ఊరే గింపులో డీజేలకు అనుమతిలేదని వైరా సీఐ సాగర్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం చింతకాని పోలీస్‌స్టేషన్‌లో దేవీ నవరాత్రుల ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఊరిగేంపు కార్యక్రమం ప్రశాంత వాతా వరణంలో నిర్వహించాలన్నారు. అల్లర్లకు తావివ్వరాదని, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎన్ వీరెందర్, సిబ్బంది పాల్గొన్నారు.